
సాక్షి
అనంతపురం
శనివారం ∣ 8 ∣ ఫిబ్రవరి ∣ 2025



చీనీ టన్ను రూ.20 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్ యార్డులో శుక్రవారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.20 వేలు పలికాయి.



టమాట కిలో రూ.13

కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్ట ధర రూ.13 పలికింది. కనిష్టం రూ.7. సరాసరి ధర రూ.10 ప్రకారం క్రయ విక్రయాలు జరిగాయి.

గరిష్టం/కనిష్టం
35.3°/12.8°

జిల్లా వ్యాప్తంగా శుక్రవారం చలి వాతావరణం నెలకొంది. ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోద య్యాయి. ఈశాన్యం దిశగా గాలులు గంటకు 6 నుంచి 10 కిలోమీటర్ల వేగంతో వీచాయి.

న్యూస్‌రీల్

బీఈడీ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న ఇన్‌చార్జ్ వీసీ అనిత

అనంతపురం: శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పరిధిలో బీఈడీ నాలుగో సెమిస్టర్ ఫలితాలను ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత శుక్రవారం విడుదల చేశారు. మొత్తం 630 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాగా.. 588 మంది పాసయ్యారు. 93.33 శాతం ఉత్తీర్ణత నమోదైంది. కార్యక్రమంలో రిజిస్ట్రార్ రమేష్ బాబు, డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ జీవీ రమణ, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్ లోకేశ్వర్లు పాల్గొన్నారు.

బీటెక్ ఫలితాలు విడుదల



ఫలితాలను విడుదల చేస్తున్న డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ నాగప్రసాద్ నాయుడు


అనంతపురం: జేఎన్‌టీయూ అనంతపురం పరిధిలో 2024 నవంబర్, డిసెంబర్ నెలల్లో నిర్వహించిన బీటెక్ మూడో సంవత్సరం ఒకటో సెమిస్టర్ (ఆర్–20) రెగ్యులర్, సప్లిమెంటరీ, (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ , రెండో సెమిస్టర్ (ఆర్–20), (ఆర్–19), (ఆర్–15) సప్లిమెంటరీ ఫలితాలు విడుదలయ్యాయి. వీటి వివరాలను డైరెక్టర్ ఆఫ్ ఎవాల్యుయేషన్స్ ప్రొఫెసర్ వి. నాగప్రసాద్ నాయుడు శుక్రవారం మీడియాకు వెల్లడించారు. ఫలితాల కోసం జేఎన్‌టీయూ వెబ్‌సైట్‌లో చూడాలని కోరారు. కార్యక్రమంలో కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ ఏపీ శివకుమార్, అడిషనల్ కంట్రోలర్స్ ప్రొఫెసర్ జి.శంకర్ శేఖర్ రాజు, డాక్టర్ ఎం.అంకారావు, డాక్టర్ ఎస్.శ్రీధర్ పాల్గొన్నారు.

పైసలివ్వందే పని చేయరు

- 'ఉపాధి హామీ' టీఏపై ఆరోపణలు
- సోషల్ మీడియాపై వైరల్

శింగనమల: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం శింగనమల మండల టెక్నికల్ అసిస్టెంట్ నారాయణస్వామిపై అవినీతి ఆరోపణలు వెల్లువెత్తాయి. ఈయన పైసలివ్వందే పనిచేయరంటూ పలువురు సోషల్ మీడియా వేదికగా ఆరోపణలు గుప్పించారు. ఈ పోస్టులు ప్రస్తుతం వైరల్‌గా మారాయి. గోకులం షెడ్ల నిర్మాణాలకు సంబంధించి బిల్లులు పెట్టాలంటే లంచం డిమాండ్ చేస్తున్నారని పేర్కొన్నారు. ఇదే మండలంలో 15 ఏళ్లుగా పనిచేస్తూ అవినీతికి పాల్పడుతున్నారని, పై అధికారులకు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని ఆరోపించారు. ఈ అంశంపై ఎంపీడీఓ భాస్కర్ రాయల్‌ను వివరణ కోరగా.. టీఏపై వచ్చిన ఆరోపణలపై విచారణ చేసి, నిజమని తేలితే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

'పది' విద్యార్థులకు నేడు, రేపు ప్రత్యేక తరగతులు




అనంతపురం ఎడ్యుకేషన్: '100 రోజుల కార్యక్రమం'లో భాగంగా పదో తరగతి విద్యార్థులకు సెలవు దినాలైన శని, ఆదివారం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని జిల్లా విద్యాశాఖ అధికారి ప్రసాద్‌బాబు, డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు సూచించారు. శనివారం ఉదయం ఇంగ్లిష్, మధ్యాహ్నం గణితం, ఆదివారం ఉదయం హిందీ, మధ్యాహ్నం తెలుగు సబ్జెక్టులకు ప్రత్యేక తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. షెడ్యూలు ప్రకారం నిర్వహించేలా డిప్యూటీ డీఈఓలు పర్యవేక్షించాలని పేర్కొన్నారు.

19 నుంచి టీసీసీ పరీక్షలు

అనంతపురం ఎడ్యుకేషన్: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్స్ (టీసీసీ)కు సంబంధించి డ్రాయింగ్, టైలరింగ్, ఎంబ్రాయిడరీ లోయర్, హయ్యర్ గ్రేడ్ పరీక్షలు ఈ నెల 19 నుంచి 22వ తేదీ వరకూ జరగనున్నాయి ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అధికారి ఎం.ప్రసాదబాబు శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. రోజూ ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, ఆ తర్వాత మధ్యాహ్నం 2 నుంచి 4.30 గంటల వరకు పరీక్షలు ఉంటాయి. అభ్యర్థులు తమ హాల్ టికెట్లను https://www.bse.ap.gov.in/ వెబ్‌సైట్ ద్వారా ఈ నెల 10 నుంచి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. పరీక్షకు గంట ముందే కేంద్రానికి హాల్ టికెట్‌తో పాటు ప్రభుత్వ గుర్తింపుతో ఉన్న ఆధార్ కార్డు, పాన్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్‌లో ఏదో ఒకటి తీసుకుని హాజరు కావాలి.

పరీక్షా సమయం

- తీవ్ర ప్రభావం చూపుతున్న మొబైల్ అడిక్షన్
- యాజమాన్యాల ఒత్తిళ్లతో విద్యార్థుల్లో మరింత టెన్షన్
- విద్యార్థుల కంటే తల్లిదండ్రుల్లో పెరుగుతున్న ఆందోళన



ఉమ్మడి జిల్లాలో పరీక్షలు రాస్తున్న వారి వివరాలు

అనంతపురం జిల్లాలో

పదో తరగతి విద్యార్థులు
32,985

ఇంటర్మీడియెట్ విద్యార్థులు
48,690

ఇతర పరీక్షలు రాస్తున్న వారు
35 వేల వరకు



శ్రీసత్యసాయి జిల్లాలో

పదో తరగతి విద్యార్థులు
20,061

ఇంటర్మీడియెట్ విద్యార్థులు
23,987

ఇతర పరీక్షలు రాస్తున్న వారు
21 వేల వరకు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మరికొద్ది రోజుల్లో వార్షిక పరీక్షలు జరగనున్నాయి. దీంతో విద్యార్థుల కంటే తల్లిదండ్రుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. పదవ తరగతి మొదలుకొని ఇంటర్, డిగ్రీ ఇలా రకరకాల వార్షిక పరీక్షలు మార్చి నెలలో ఉన్నాయి. ఈ పరీక్షలు ఎలా రాయాలని విద్యార్థులు ఉత్కంఠలో ఉండగా, తల్లిదండ్రులు వీళ్లకంటే ఎక్కువ టెన్షన్ పడుతున్నారు. ఇన్నాళ్లూ చదివింది ఒకెత్తు..ఈ పరీక్షలు ఒకెత్తు.. తమ పిల్లలు మంచి మార్కులు సాధించి పోటీ పరీక్షల్లో విజయం సాధించాలన్న ఆకాంక్షతో తల్లిదండ్రులున్నారు. కానీ తల్లిదండ్రుల్లో ఆందోళన ఉండటానికి కారణముంది.. అదే మొబైల్ అడిక్షన్.

మొబైల్ ఫోన్‌కు ప్రభావితమై..

ఉమ్మడి అనంతపురం జిల్లా వ్యాప్తంగా 1.80 లక్షల మందికి పైగా విద్యార్థులు ఈ ఏడాది వార్షిక పరీక్షలు రాస్తున్నారు. వీరిలో 50 శాతం మంది ఏదో ఒక సందర్భంలో మొబైల్‌కు ప్రభావితమైన వారే. తల్లిదండ్రులను ఏమరపాటుకు గురిచేసి సామాజిక మాధ్యమాల్లో మునిగితేలిన వారే. దీని ప్రభావం ఇప్పుడు పరీక్షలపై పడనుంది. చివరి నిముషంలో తెలుసుకున్నా ఫలితం లేదు. దీంతో తమ పిల్లలు పరీక్షలు ఎలా రాస్తారోనన్న ఆందోళన తల్లిదండ్రులను వెంటాడుతోంది.

ఒత్తిడితో సతమతం

కొంతమంది విద్యార్థులను మొబైల్ వ్యసనం ఇబ్బంది పెడుతుండగా.. మరోవైపు కాలేజీ యాజమాన్యాల ఒత్తిళ్లు విద్యార్థుల్లో ఉన్న మానసిక స్థైర్యాన్ని కోల్పోయేలా చేస్తున్నాయి. కొన్ని చోట్ల ప్రైవేటు కాలేజీ యాజమాన్యాలు ఫీజులు కట్టలేదని ఒత్తిళ్లు తెచ్చి విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఉదాహరణకు.. పదిహేను రోజుల క్రితం నారాయణ కాలేజీలో ఫీజుల ఒత్తిడి భరించలేక చరణ్ అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఇలా ఒత్తిళ్లతో సతమతమవుతున్న విద్యార్థులు చాలామందే ఉన్నారు.

సమయస్ఫూర్తితో వెళ్లాలి



టీచర్లు, తల్లిదండ్రులు ఈ సమయంలో విద్యార్థుల పట్ల బ్యాలెన్స్‌గా వెళ్లాలి. ఎక్కువ ఒత్తిడి తెస్తే జ్ఞాపక శక్తి తగ్గుతుంది. పరీక్షల సమయంలో విద్యార్థులతో పోల్చి (కంపారిజన్) చూడటం, చెప్పడం చేయకూడదు. ఈ టైంలో కుటుంబ ఆర్థిక విషయాలు ప్రస్తావించకూడదు. వీలైనంత మేరకు మొబైల్ వాడకుండా ఉంటే కచ్చితంగా సక్సెస్ అవుతారు.

– డాక్టర్ ఎండ్లూరి ప్రభాకర్, మానసిక వైద్యనిపుణులు

రివిజన్ టైం అని గుర్తుంచుకోవాలి



పరీక్షల సమయం అంటే చదివినవి రివిజన్ చేసుకోవడమే. విద్యార్థులు సెల్ఫ్ ప్రెజర్ వదిలేయాలి. ఎవరికో ఎక్కువ వస్తాయి, నాకు తక్కువ వస్తాయేమో అనేది మనసులోంచి తీసెయ్యాలి. ఈ టైంలో తెల్లవార్లూ చదవాల్సిన అవసరం లేదు. ఆరు గంటల నిద్ర అవసరం. తల్లిదండ్రులు చదవగలవు అన్న ధైర్యమిస్తే చాలు.

–డాక్టర్ విశ్వనాథరెడ్డి, మానసిక వైద్య నిపుణులు, నేషనల్ హెల్త్ మిషన్



ర్యాంకులు..మార్కులు చూడొద్దు



చాలామంది టీచర్లు, తల్లిదండ్రులు మార్కులు ఎక్కువ రావాలి, ర్యాంకులు సాధించాలనే చూస్తున్నారు. సబ్జెక్టుమీద అవగాహన ఉందా లేదా అన్నది చూడటం లేదు. సబ్జెక్టుపై పట్టు ఉందో లేదో అని చూసినప్పుడు విద్యార్థి భవిష్యత్తు తెలుస్తుంది. కెరీర్‌లో విజయాలు సాధించే అవకాశం ఉంటుంది.

– తరిమెల రమణారెడ్డి, అనంతపురం

లోక్‌అదాలత్‌తో సమస్యలకు శాశ్వత పరిష్కారం



మాట్లాడుతున్న న్యాయమూర్తి శివప్రసాద్

అనంతపురం: అపరిష్కృతంగా ఉన్న సమస్యలకు శాశ్వత పరిష్కారాన్ని శాశ్వత లోక్‌అదాలత్ ద్వారా పొందవచ్చునని శాశ్వత లోక్‌అదాలత్ చైర్మన్ కె.శ్రీనివాసరావు తెలిపారు. న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి జి.శివప్రసాద్‌యాదవ్ అధ్యక్షతన శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో శాశ్వత లోక్ అదాలత్ ద్వారా అందే న్యాయ సేవలను ఆయన వివరించారు. జనన, కుల, వివాహ, మరణ ధ్రువపత్రాలు జారీ జాప్యం చోటు చేసుకున్నా, న్యాయపరమైన ఇబ్బందులు ఉన్నా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ఇటికే నల్లప్ప తదితరులు పాల్గొన్నారు.

పిల్లలకు విషమిచ్చి తల్లి ఆత్మహత్యాయత్నం

అనంతపురం: ముగ్గురు పిల్లలతో కలిసి తల్లి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన శుక్రవారం అనంతపురంలో చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. ప్రియాంకనగర్‌కు చెందిన అనిత, పరమేశ్ భార్యాభర్తలు. వీరికి కుమార్తె అక్షిత, కుమారులు ప్రణీతసాయి, ప్రభాస్ సంతానం. మనస్పర్థల కారణంగా ఏడాది కిందట భార్యాభర్తలు విడిపోయారు. రెండు నెలల కిందట పరమేశ్ రెండో వివాహం చేసుకున్నాడు. మరి పిల్లల పరిస్థితి ఏమిటని భర్త పరమేశ్‌ను ప్రశ్నించింది. కుటుంబ పోషణ కోసం భరణం ఇవ్వాలని కోరింది. ఈ క్రమంలో శుక్రవారం సాయంత్రం పెద్ద మనుషుల సమక్షంలో పంచాయితీ జరిగింది. అయితే అనిత కోరిన విధంగా భరణం చెల్లించేందుకు పరమేశ్ అంగీకరించలేదు. మనస్తాపం చెందిన అనిత ముగ్గురు పిల్లలకు పురుగుమందు తాపించి.. తర్వాత తానూ తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. విషయం తెలుసుకున్న పరమేశ్, రెండో భార్య కలిసి హుటాహుటిన వారిని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రస్తుతం నలుగురి ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. త్రీటౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

● నిర్లక్ష్యానికి నిలువుటద్దం



గుజిరీ షెడ్డును తలపిస్తున్న ఎమర్జెన్సీ వార్డు

అనంతపురం కార్పొరేషన్: ప్రభుత్వ సర్వజనాస్పత్రి గుజిరీని తలపిస్తోంది. పనికిరాని వైద్య పరికరాలు, వివిధ వస్తువులను వార్డుల్లో గుట్టలుగుట్టలుగా పడేశారు. గత ప్రభుత్వంలో రోగుల సౌకర్యార్థం ఆస్పత్రికి వెంటిలేటర్లు, పల్స్ ఆక్సీ మీటర్లు, ఆక్సిజన్ కాన్సన్‌ట్రేటర్స్, ఐసీయూ వార్డు మంచాలు, సాధారణ మంచాలతో పాటు ఎన్నో పరికరాలను అందించారు. కాలక్రమేణా వాటికి చిన్నపాటి రిపేరీలు వచ్చాయి. దీంతో పలు వెంటిలేటర్లు, పల్స్ ఆక్సీ మీటర్లు, స్ట్రెచర్లు తదితర వాటిని క్యాజువాలిటీ, ఎఫ్ఎం, తదితర వార్డుల్లో మూలనపడేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల నెలల తరబడి అవి అలానే ఉండిపోయాయి. ఆస్పత్రి వెనుక డైట్ కేంద్రం వద్ద వందల సంఖ్యలో పాడైపోయిన మంచాలు, వీల్‌చైర్లు తదితర సామగ్రి పడేశారు. వాస్తవానికి చెడిపోయిన పరికరాల్లో రిపేరీ చేయించగల వాటిని గుర్తించి వినియోగంలోకి తీసుకురావచ్చు. పనికిరాని వాటిని వేలం వేసి విక్రయించి..తద్వారా వచ్చిన సొమ్ముతో కొత్త పరికరాలు కొనవచ్చు. అయితే సర్వజనాస్పత్రి ఉన్నతాధికారులు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తుండడం చూసి ప్రజలు మండిపడుతున్నారు.



ఎఫ్ఎం వార్డులో మూలనపడ్డ వెంటిలేటర్లు

కాలువ లైనింగ్ పనులు ఆపాల్సిందే

- 'అనంత' రైతుల శవాల మీద కుప్పానికి నీళ్లు తీసుకుపోవద్దు
- హంద్రీ–నీవా పరిరక్షణ సమితి ఏర్పాటు చేశాం
- కాలువ కింది గ్రామాల్లో ఈ నెల 11 నుంచి 24 వరకు సభలు
- రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

రాప్తాడు రూరల్: జిల్లా రైతుల కడుపుకొడుతూ కమీషన్ల కోసం చేపట్టే హంద్రీ–నీవా కాలువ లైనింగ్ కాంక్రీట్ పనులను ఆపాల్సిందేనని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి డిమాండ్ చేశారు. తన సొంత నియోజకవర్గం కుప్పానికి సాగునీరు తీసుకెళ్లేందుకు ప్రత్యామ్నాయ మార్గాలు ఉన్నా 'అనంత' జిల్లా రైతుల శవాల మీద తీసుకెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం అనంతపురం శివారులోని క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రాప్తాడు నియోజకవర్గం పరిధిలోని ఆరు మండలాల వైఎస్సార్‌సీపీ కన్వీనర్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీ సభ్యులు, వైస్ ఎంపీపీలు, ఇతర ముఖ్య నాయకులు పాల్గొన్నారు. తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ హంద్రీ–నీవా రెండో దశలో కాంక్రీట్ లైనింగ్ పనులు చేయకూడదని, టెండర్లు రద్దు చేయాలనే డిమాండ్‌తో కాలువ కింది గ్రామాల్లో సభలు ఏర్పాటు చేసి రైతులకు అవగాహన కల్పిస్తామన్నారు. ఇందు కోసం హంద్రీ–నీవా పరిరక్షణ సమితి ఏర్పాటు చేసినట్లు చెప్పారు. ఇందులో ఆయా గ్రామాల సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు సభ్యులుగా ఉంటారన్నారు. హంద్రీ–నీవా పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో ఈ నెల 11 నుంచి 24 వరకు 10 చోట్ల గ్రామ సభలు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. హంద్రీ– నీవా కాలువకు లైనింగ్ చేస్తే కాలువ పరిసరాల్లో దాదాపు 15 కిలోమీటర్ల మేర పెరిగిన భూగర్భజలాలు అడుగంటిపోతాయన్నారు. బోర్లన్నీ ఎండిపోయి లక్షలాది ఎకరాలు బీళ్లుగా మారే ప్రమాదముందని ఆందోళన వ్యక్తం చేశారు. లైనింగ్ పనులు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా జిల్లా రైతులతో కలిసి ఉద్యమిస్తామని స్పష్టం చేశారు. చిత్తూరు జిల్లాకు గాలేరు–నగరి ప్రాజెక్ట్ ద్వారా నీరు తీసుకెళ్లే అవకాశం ఉందన్నారు. అలా చేయకుండా కమీషన్ల కోసం కక్కుర్తిపడి అనంత జిల్లా రైతులకు తీవ్రంగా నష్టం కలిగిస్తూ కాలువ లైనింగ్ పనులు చేపట్టి తద్వారా కుప్పంకు నీళ్లు తీసుకోవాలని చూస్తున్నారన్నారు. ఫలితంగా జిల్లా 30 టీఎంసీల నీళ్లు కోల్పోవాల్సి వస్తుందన్నారు.

రైతులకు జగన్ అండగా నిలిచారు

వైఎస్సార్‌సీపీ పాలనలో అప్పటి సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి రైతులకు అండగా నిలిచారని తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి గుర్తు చేశారు. పంటల బీమా ప్రీమియం ప్రభుత్వమే చెల్లించిందని, పంట నష్టపోతే ఇన్‌పుట్ సబ్సిడీ ఇచ్చి ఆదుకుందని వివరించారు. గత ఐదేళ్లలో రైతులకు భారీ ఎత్తున సాయం చేశారన్నారు. పేదలు, రైతులకు గత ప్రభుత్వంలో అమలు చేసిన పథకాలన్నీ కూటమి ప్రభుత్వం నిలిపేసిందన్నారు. చివరకు రైతులకు నీళ్లు కూడా లేకుండా చేస్తున్నారన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి టెండర్లు రద్దు చేసి లైనింగ్ జరగకుండా నిలిపేయాలని డిమాండ్ చేశారు.

ప్రజా పంపిణీ వ్యవస్థ అస్తవ్యస్తం

- స్టోర్ల వద్దే సరుకుల పంపిణీ
- రొటేషన్ పద్ధతిలో నిర్వహణ
- ఎప్పుడు వేస్తారో తెలీని వైనం
- రేషన్ కోసం ఎగబడుతున్న జనం
- పనులు మాని పడిగాపులు





అనంతపురంలో స్టోర్ వద్ద రేషన్ కోసం బారులు తీరిన కార్డుదారులు, అనంతపురం మారుతీనగర్‌లోని ఒక స్టోర్ వద్ద రేషన్ కోసం రాత్రివేళ పడిగాపులు

అనంతపురం అర్బన్: ప్రజా పంపిణీ వ్యవస్థ చౌక డిపోల ద్వారా అందిస్తున్న నిత్యావసరాల పంపిణీ అస్తవ్యస్తంగా మారింది. ప్రతి నెలా కార్డుదారులకు కష్టాలు తప్పడం లేదు. సకాలంలో సరుకులు అందక పరేషాన్ అవుతూనే ఉన్నారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఎండీయూ వాహనాల ద్వారా ఇంటి వద్దకే రేషన్ పంపిణీ విధానం అమలు చేశారు. వృద్ధులు, నడవలేని వారు, స్టోర్‌కు దూరంగా ఉన్న వారు నిర్ణీత తేదీల్లో ఇంటి వద్దనే నిత్యావసర సరుకులు పొందేవారు. విజయవంతంగా సాగిన ఈ విధానాన్ని కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రద్దు చేసింది. పాత పద్ధతిలోనే చౌకధాన్యపు దుకాణాల (స్టోర్ల) వద్దకే వెళ్లి సరుకులు తెచ్చుకునేలా చర్యలు చేపట్టింది. అది కూడా స్టోర్లన్నీ ఒకేసారి తెరిచి సరుకులు పంపిణీ చేయడం లేదు. రొటేషన్ పద్ధతి అవలంబిస్తోంది. ఒక ప్రాంతంలో ఉన్న స్టోర్లలో మూడు రోజులు ఒకటి తెరిస్తే, మరో మూడు రోజులు ఇంకొకటి తెరుస్తున్నారు. దీంతో తెరిచి ఉన్న స్టోర్ వద్దకు లబ్ధిదారులు పోటెత్తుతున్నారు. ఈ క్రమంలో రాత్రి వరకైనా సరే గంటల తరబడి వేచి ఉండి సరుకులు తెచ్చుకోవాల్సి వస్తోంది. జిల్లాలో 1,645 చౌకధాన్యపు డిపోలు (స్టోర్లు) ఉన్నాయి. వీటి పరిధిలో 6,47,520 బియ్యం కార్డులు ఉన్నాయి.

ఎండీయూ ఈ–పాస్‌తో సమస్య

ఒక ఎండీయూ (బియ్యం పంపిణీ వాహనం) నిర్వాహకుని వద్ద ఈ–పాస్ యంత్రం ఉంటుంది. ఇదే సమస్యకు ప్రధాన కారణమయ్యింది. ఒక ఎండీయూ పరిధిలో మూడు నుంచి నాలుగు స్టోర్లు వస్తాయి. దీంతో నిర్వాహకుడు అన్ని స్టోర్లలో ఒకేసారి సరుకుల పంపిణీకి వీలు కాకపోవడంతో మూడు రోజులు ఒక స్టోర్ వద్ద ఈ–పాస్ యంత్రం పెట్టుకుని దాని డీలర్ ద్వారా రేషన్ ఇస్తాడు. ఆ తరువాత మరో స్టోర్ వద్ద.. ఇలా మూడు రోజులకు ఒక స్టోర్ వద్ద సరుకులు పంపిణీ చేస్తారు.

నిబంధనల ఉల్లంఘన

ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రతి చౌక ధరల దుకాణాలు ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు కార్డుదారులకు రేషన్ సరుకులు ఇవ్వాలి. ఎక్కడా ఈ నిబంధన అమలు కావడం లేదు. ప్రతి డీలర్‌కూ ఒక ఈ–పాస్ యంత్రాన్ని ప్రభుత్వం ఇవ్వకపోవడంతో సరుకులు తీసుకునేందుకు లబ్ధిదారులు ఇబ్బందిపడాల్సి వస్తోంది. ప్రతి నెలా రేషన్ కోసం కార్డుదారులు తిప్పలు పడక తప్పడం లేదు.

పడిగాపులు తప్పడం లేదు

రేషన్ సరుకులు అన్ని స్టోర్లలోనూ ఒకేసారి ఇవ్వడం లేదు. మూడు రోజులు ఒక స్టోర్‌లో ఇస్తే, మరో మూడు రోజులు ఇంకో స్టోర్‌లో ఇస్తున్నారు. దీంతో ఎంత రాత్రయినా స్టోర్‌కు వెళ్లి బియ్యం తెచ్చుకుంటున్నాము. ఒక నెల తీసుకోకపోతే ఎక్కడ కార్డు రద్దు చేస్తారో అనే భయంతో పడిగాపులు కాసి సరుకులు తీసుకుంటున్నాం.

– సత్యమూర్తి, మారుతీనగర్, అనంతపురం

అప్పుడే బాగుండేది..

గత ప్రభుత్వంలో ఇంటి వద్దకే బండి వచ్చి సరుకులు ఇచ్చేవారు. అప్పుడు ఎంతో బాగుండేది. ప్రతి నెలా ఒక తేదీన ఇంటి దగ్గరలోకి బండి వచ్చేది. మా వీధిలో ఉండేవాళ్లం వెళ్లి బియ్యం, సరుకులు తెచ్చుకునేవాళ్లం. ఇప్పుడా పరిస్థితి లేదు. పనులు మానుకుని స్టోర్ వద్దకే వెళ్లి గంటల తరబడి క్యూలో వేచి ఉండి తెచ్చుకుంటున్నాం.

– సత్యవతమ్మ, హమాలీకాలనీ, అనంతపురం

క్లుప్తంగా

నేడు భీష్మ ఏకాదశి వేడుకలు

అనంతపురం కల్చరల్: నగరంలోని రామనగర్ శ్రీరుక్మిణీ పాండురంగ విఠల స్వామి ఆలయంలో శనివారం భావసార క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో భీష్మ ఏకాదశి వేడుకలు నిర్వహించనున్నారు. ఈ మేరకు నిర్వాహకుడు ఆనంద్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. మాఘ మాసంలో వచ్చే పవిత్ర ఏకాదశి పర్వదినాన్ని భావసార క్షత్రియులు అత్యంత పవిత్రంగా భావిస్తారని పేర్కొన్నారు. ఉదయం 6.30 నుంచే వేడుకలు ప్రారంభమవుతాయని, 8 గంటలకు శ్రీరుక్మిణీ పాండురంగస్వామి నిజ పాద దర్శనం, అభిషేకాలు, అర్చనలు జరుగుతాయని, భక్తులు తీర్థప్రసాదాలు స్వీకరించాలని కోరారు.

చెక్‌డ్యాంలో జలకళ



వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద చెక్‌డ్యాం నుంచి కనువిందుగా వస్తున్న నీరు

ఆత్మకూరు: వడ్డుపల్లి టోల్‌గేట్ వద్ద ఉన్న చెక్‌డ్యాం జలకళతో కనువిందు చేస్తోంది. పక్కనే ఉన్న పీఏబీఆర్ కాలువలోని నీరు వచ్చి చేరడంతో చెక్‌డ్యాం నిండి నీరు కిందకు పారుతూ చూపరులకు ఆహ్లాదం పంచుతోంది. దీంతో ఆ దారి గుండా వెళ్లే వారంతా వాహనాలు పక్కన ఆపి మరీ నీటితో ఆడుకుంటూ ఆనంద పడుతున్నారు. మరికొందరు సెల్ఫీలు దిగుతున్నారు.

రేపు పుస్తకావిష్కరణ సభ

అనంతపురం కల్చరల్: జిల్లా రచయితల సంఘం మాజీ అధ్యక్షుడు డాక్టర్ జూపల్లి ప్రేమ్‌చంద్ రచించిన 'ఆధునిక తెలుగు వచన కవిత్వం -విభిన్న ధోరణులు' పుస్తకాన్ని ఏపీ అభ్యుదయ రచయితల సంఘం వారు ఈ నెల 9న ఉదయం పది గంటలకు నగరంలోని ఎన్జీవో హోమ్‌లో ఆవిష్కరించనున్నారు. జిల్లాలోని రచయితలందరూ పాల్గొనే సభకు సాహితీ అభిమానులు విచ్చేసి జయప్రదం చేయాలని నిర్వాహకులు డాక్టర్ నానీల నాగేంద్ర ఓ ప్రకటనలో కోరారు.

ఆటో కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ, ఆటో యూనియన్ నాయకులు

అనంతపురం అర్బన్: ఆటో కార్మికుల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని డీఆర్‌ఓ ఎ.మలోలకు సీఐటీయూ, భగత్‌సింగ్ ఆటో డ్రైవర్ల సంఘం నాయకులు విన్నవించారు. డీఆర్‌ఓను శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో సీఐటీయూ నగర కార్యదర్శి వెంకటనారాయణ, ఆటో డ్రైవర్ల సంఘం అధ్యక్ష కార్యదర్శులు నాగరాజు, శ్రీనివాసులు, నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఆటో డ్రైవర్ల జీవనోపాధిని దెబ్బతీస్తున్న రాపిడో సంస్థ కార్యకలాపాలను జిల్లాలో నిషేధించాలని కోరారు.

కమిషనర్‌గా బాలస్వామి బాధ్యతల స్వీకరణ



నగరపాలక సంస్థ కమిషనర్‌గా బాధ్యతలు తీసుకుంటున్న బాలస్వామి

అనంతపురం కార్పొరేషన్: నగర పాలక సంస్థ కమిషనర్‌గా బాలస్వామి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఏలూరు నగరపాలక సంస్థ కార్యదర్శిగా ఉన్న ఆయన్ను ప్రభుత్వం ఇటీవల అనంతపురం నగర పాలక సంస్థ కమిషనర్‌గా నియమించిన విషయం విదితమే. బాధ్యతల స్వీకరణ అనంతరం ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధికి ప్రతి ఒక్కరూ అంకిత భావంతో పని చేయాలని సిబ్బందికి సూచించారు. అంతకుముందు నూతన కమిషనర్‌కు కార్యాలయంలోని వివిధ విభాగాల అధిపతులు, ఉద్యోగులు పుష్పగుచ్ఛాలు అందించి అభినందనలు తెలిపారు.

విద్యార్థులకు వ్యాసరచన పోటీలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న దృశ్యం

చెన్నేకొత్తపల్లి: రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం చెన్నేకొత్తపల్లి పోలీసులు విద్యార్థులకు వ్యాస రచన పోటీలు నిర్వహించారు. 'ట్రాఫిక్ నిబంధనలు' అనే అంశంపై స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన వ్యాస రచన పోటీలకు విశేష స్పందన లభించింది. ప్రతిభ చూపిన విద్యార్థులకు ఎస్‌ఐ సత్యనారాయణ బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నగర వనం.. అధ్వానం

- ఆహ్లాదం.. ఆనందం.. ఆవిరి
- పంపనూరు పార్కులో ధ్వంసమైన ఆట పరికరాలు
- పట్టించుకోని అధికారులు.. పర్యాటకులకు నిరాశే



కొమ్ములు విరిగిన జింక బొమ్మ



పూర్తిగా విరిగిపోయిన నెమలి బొమ్మ

ఆత్మకూరు: ఉమ్మడి జిల్లాలో పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయం ప్రఖ్యాతిగాంచింది. ఇక్కడికి ప్రతి ఆది, మంగళవారాల్లో జిల్లా నలుమూలల నుంచే కాకుండా కర్ణాటక నుంచి కూడా భక్తులు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ఆలయానికి వచ్చే భక్తులు, పర్యటకులు చాలామంది సమీపంలోని నగర వనం (సిటీ పార్కు)ను తప్పకుండా సందర్శిస్తారు. ఇక్కడ రకరకాల ఆట పరికరాలు ఉంటాయి. పిల్లలతో కలిసి ఆనందంగా గడుపుదామనుకున్న వారికి నిరాశే ఎదురవుతోంది. 70 శాతం మేర పరికరాలు ధ్వంసమైపోయాయి. ఊయలలు, వాకర్‌లు, పిల్లలు కూర్చునే చైర్లు, రింగ్స్‌లు, జారుడు పరికరాలు విరిగిపోయాయి.



కొమ్ము విరిగిన దున్నపోతు బొమ్మ

అంతేకాకుండా పర్యాటకులకు ఆహ్లాదకరంగా కనపడేలా ఏర్పాటు చేసిన జంతువుల బొమ్మలు కూడా దెబ్బతిన్నాయి. నగర వనంలో ప్రవేశానికి ఒకొక్కరి నుంచి రూ.20 వసూలు చేసే అధికారులు.. ఇక్కడ నిర్వహణను గాలికొదిలేశారు.



తెగిపోయిన ఊయల



ధ్వంసమైన చైర్



దెబ్బతిన్న పరికరం

పర్యాటకులు ఇబ్బంది పడుతున్నారు



పంపనూరు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి వచ్చే వారు ఎంతోమంది భక్తులు, పర్యాటకులు సిటీ పార్కును సందర్శిస్తుంటారు. చాలామంది కుటుంబ సమేతంగా వస్తుంటారు. అయితే పార్కులో ఆట పరికరాలు దెబ్బతిని ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు.

– ఎర్రిస్వామి, సర్పంచ్, పంపనూరు

పరికరాలు మార్చాలి



పంపనూరు సిటీ పార్కులో ఆట వస్తువులు, జంతువుల బొమ్మలు చాలా వరకు ధ్వంసమయ్యాయి. సంతోషంగా గడపడానికి వచ్చిన వారు, చిన్నారులు నిరాశకు గురవుతున్నారు. అధికారులు స్పందించి దెబ్బతిన్న వాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేసి.. సదుపాయాలు మెరుగు పరచాలి.

– అశోక్‌కుమార్, పంపనూరు తండా

అంగన్‌వాడీలకు అందని పౌష్టికాహారం

- మూడు నెలలుగా అందని బేడలు
- బియ్యం కూడా అరకొరగా సరఫరా
- అప్పులు చేసి సరుకులు తెచ్చుకుంటున్న సిబ్బంది

ఆత్మకూరు: అంగన్‌వాడీ సెంటర్లలో నమోదైన చిన్నారులకు, గర్భవతులకు, బాలింతలకు పౌష్టికాహారం సరిగ్గా అందడం లేదు. కూటమి ప్రభుత్వం కొలువుదీరాక రేషన్ దుకాణాల నిర్వహణను టీడీపీ నేతలు దక్కించుకున్నారు. కానీ నిర్వహణ మాత్రం గాలికి వదిలేశారు. ఫలితంగా మండలంలోని వడ్డుపల్లి గ్రామంలో రెండు అంగన్‌వాడీ కేంద్రాలు ఉండగా, 27 మంది చిన్నారులు, 10 మంది గర్భిణులు, మరో ఐదుగురు బాలింతలు నమోదై ఉన్నారు. గత మూడు నెలలుగా సరిగా సరుకులు అందక సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించడంతో అంగన్‌వాడీ కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

వేలి ముద్రలు వేయించుకున్నా...

పౌష్టికాహారం సరుకుల పంపిణీ కోసం డీలర్లు మూడు నెలలకు సంబంధించి అంగన్‌వాడీలతో వేలిముద్రలు వేయించుకున్నారు. కానీ సరుకులు ఎంత మేర అందిస్తున్నారన్న దానికి సంబంధించిన రిసిప్ట్ మాత్రం మూడు నెలలుగా ఇవ్వడం లేదు. ఒక్క నెల రిసిప్ట్ ఇస్తే అది బఫర్ రావడంతో ప్రతి నెలా ఆ అంగన్‌వాడీ పరిధిలోని గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు ఎంత మేరకు పౌష్టికాహారం అందించాలో తెలుస్తుంది. కానీ రేషన్ డీలర్లు రిసిప్ట్ ఇవ్వకపోవడంతో సరుకులు అరకొరగా వస్తున్నట్లు తెలుస్తోంది. దీంతో ఏం చేయాలో తెలియని అంగన్‌వాడీలు అప్పులు చేసి సరుకులు కొంటున్నారు. లేకపోతే తమ ఇళ్లలోని సరుకులు తెచ్చి పౌష్టికాహారం అందిస్తున్నారు.



వడ్డుపల్లి అంగన్‌వాడీ సెంటర్‌లో అరకొర వంటతో భోజనం చేస్తున్న చిన్నారులు

కంది బేడల ఊసే లేదు

అంగన్‌వాడీ కేంద్రాలకు రేషన్ దుకాణాల నుంచి ప్రతి నెలా బియ్యం, కందిబేడలు, నూనె ఇవ్వాల్సి ఉంది. ఇవన్నీ అందితేనే లబ్ధిదారులకు భోజనం అందించే అవకాశం ఉంటుంది. ఒక్కో నెలా 20 కిలోల వరకు కంది బేడలు ఇవ్వాల్సి ఉంది. కానీ మూడు నెలల నుంచి కందిబేడలు మాత్రం సరఫరా చేయలేదు. బియ్యం కూడా అరకొరగానే ఇస్తున్నట్లు సమాచారం. ఈ విషయం రెవెన్యూ అధికారులకు తెలిసినా పట్టీపట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సరుకుల పంపిణీ సమస్య గురించి వీఆర్‌ఓకు తెలియజేస్తే సీఎస్‌డీటీకి చెప్పాలని చెబుతున్నారని, సీఎస్‌డీటీకి చెబితే తహసీల్దార్‌కు చెప్పాలని సలహా ఇస్తున్నారంటూ అంగన్‌వాడీలు వాపోతున్నారు. ఇప్పటికైనా సమస్య పరిష్కరించి గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సకాలంలో మెనూ మేరకు పౌష్టికాహారం అందించేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

నులి పురుగుల నివారణతోనే ఆరోగ్యం

రాప్తాడు: నులిపురుగుల నివారణతోనే పిల్లలు ఆరోగ్యంగా ఉంటారని ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న అన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రసన్నాయపల్లి పంచాయతీలోని అంగన్‌వాడీ కేంద్రం -1లో అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, 1 నుంచి 19 ఏళ్లలోపు పిల్లలందరికీ ఆల్బెండజోల్ మాత్రలను విధిగా వేయాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో రెండేళ్లలోపు చిన్నారులకు సగం మాత్రను (200 మిల్లీ గ్రాములు) నీళ్లలో కలిపి వేయాలన్నారు. 2 నుంచి 19 ఏళ్లలోపు వయస్సు ఉన్న పిల్లలకు మధ్యాహ్నం భోజనం తర్వాత 400 మిల్లీ గ్రాముల మాత్ర చప్పరించేలా చూడాలన్నారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం చంద్రకళ, అంగన్‌వాడీ కార్యకర్త బులగొండ యల్లమ్మ, అంగన్‌వాడీ సహాయకురాలు విజయలక్ష్మి, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



చిన్మయనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో అవగాహన కల్పిస్తున్న ఎంఎల్‌హెచ్‌పీ ప్రసన్న



మద్యం.. జీవితం ఛిద్రం

ఆర్టీసీ బస్టాండు సమీపంలోని రోడ్డుపై పడుకున్న ఈ ఇద్దరు వ్యక్తులు దివ్యాంగులు. శుక్రవారం రాత్రి ఇలా అచేతనంగా పడి ఉండగా అయ్యో పాపం అంటూ దగ్గరికి వెళ్లిన వారంతా వారి వద్ద మద్యం వాసన గుప్పుమనడంతో వెంటనే వెనక్కు వెళ్లిపోయారు. కూటమి ప్రభుత్వం కొలువుదీరగానే సీఎం చంద్రబాబు రూ.99 మద్యం అందించడం.. మద్యం దుకాణాలు పెంచి నిరంతరం మద్యం అందుబాటులోకి తేవడంతో జనం ఇలా తప్పతాగి రోడ్లపై పడి జీవితాలు నాశనం చేసుకుంటున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం

వెట్టి చాకిరీతో సమాజాభివృద్ధికి విఘాతం

అనంతపురం సిటీ: వెట్టి చాకిరీతో సమాజాభివృద్ధికి విఘాతం కలుగుతుందని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ(డీఎల్‌ఎస్‌ఏ) సెక్రటరీ జి.శివప్రసాద్ యాదవ్ అన్నారు. కార్మిక శాఖ ఆధ్వర్యంలో అనంతపురం లెనిన్ నగర్‌లోని సర్వశిక్ష అభియాన్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన వెట్టి చాకిరీ నిర్మూలన దినోత్సవానికి శివప్రసాద్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వెట్టి చాకిరీ అనేది సామాజిక రుగ్మత అని, ప్రోత్సహించినా, అనుసరించినా చట్టప్రకారం శిక్షార్హులవుతారని హెచ్చరించారు. దీని నిర్మూలనకు జిల్లాలో విజిలెన్స్ కమిటీలు ఏర్పాటు చేశామన్నారు. ఎక్కడైనా వెట్టి చాకిరీ చేయిస్తున్నట్లు తెలిస్తే సమాచారం ఇవ్వాలని ప్రజలకు సూచించారు. ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ మాట్లాడుతూ తమ శాఖ అధికారులు, సిబ్బందితో పాటు సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, వీఆర్‌ఓలు, వీఆర్‌ఏలు, స్టోర్ డీలర్లు ఇలా ప్రతి ఒక్కరూ వెట్టి చాకిరీ, బాల కార్మికుల సమస్యలపై స్పందించాలని కోరారు. అనంతరం వెట్టి చాకిరీ నిర్మూలనకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో కార్మిక శాఖ సహాయ అధికారులు కె.రాధా రమాదేవి, ఎం.సుజాత, బి.ప్రతాప్ నాయుడు, ఏవీ శివప్రసాద్, పి.రవీంద్రనాథ్, డీసీపీఓ మంజునాథ్, చైల్డ్‌లైన్ కో–ఆర్డినేటర్ కృష్ణమాచారి పాల్గొన్నారు.



పోస్టర్లు ఆవిష్కరిస్తున్న జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ శివప్రసాద్ యాదవ్, ఐసీడీఎస్ పీడీ వనజా అక్కమ్మ తదితరులు

రాష్ట్ర విద్యార్థుల జాతా జయప్రదం చేయండి

అనంతపురం ఎడ్యుకేషన్: మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు శతవర్ధంతి సందర్భంగా ఈ నెల 22, 23 తేదీల్లో నిర్వహించనున్న 'రాష్ట్ర విద్యార్థు జాతా'ను జయప్రదం చేయాలని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు పోస్టర్లను శుక్రవారం ఏఐడీఎస్‌ఓ కేంద్ర సమితి అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శి ఆధ్వర్యంలో స్థానిక సంఘం కార్యాలయంలో విడుదల చేశారు. సంఘం కేంద్ర సమితి అధ్యక్షులు సౌరవ్‌ఘోష్, ప్రధానకార్యదర్శి శిబాషిష్ ప్రహారాజ్, సహాయ కార్యదర్శి అజయ్‌కామత్, రాష్ట్ర అధ్యక్షుడు హరీష్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి ఇ.మహేష్ మాట్లాడుతూ రాజీలేని స్వాతంత్ర్య సమరయోధులు, మన్యం విప్లవ జ్యోతి అల్లూరి సీతారామరాజు అని కొనియాడారు. ఆయన శతవర్ధంతిని పురస్కరించుకొని సంవత్సరం పాటుగా ఏఐడీఎస్‌ఓ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అందులో భాగంగా ఈ నెల 22, 23 తేదీల్లో విశాఖపట్నం నుంచి అల్లూరిని బ్రిటీష్ సామ్రాజ్యవాదులు కాల్చి చంపిన కృష్ణదేవిపేటలోని అల్లూరి సమాధి వరకు విద్యార్థుల జాతా నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె శివ ప్రసాద్, బి.సురేష్, చరణ్ రాజ్, చరణ్ తేజ్ పాల్గొన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

ఉలవ పంట దగ్ధం

- నాలుగు ఎకరాల్లో పంట నష్టం

ఆత్మకూరు: మండలంలోని బి, యాలేరు గ్రామానికి చెందిన ఇద్దరు రైతులు నాలుగు ఎకరాల్లో సాగుచేసిన ఉలవ పంట శుక్రవారం దగ్ధమైంది. బాధితులు తెలిపిన వివరాల మేరకు... గ్రామానికి చెందిన వల్లూరు రామాంజినేయులు, వల్లూరు పాపన్న నాలుగు ఎకరాల్లో ఉలవ పంట సాగు చేశారు. శుక్రవారం ఉదయం పొలంలో మంటలు చెలరేగడంతో స్థానికులు రైతులకు సమాచారం ఇచ్చారు. వెంటనే వారు వెళ్లి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఫైర్ ఇంజిన్ వచ్చినప్పటికీ ఫలితం లేకుండా పోయింది. మొత్తం నాలుగు ఎకరాల్లోని పంట కాలిపోయింది. తమకు రూ.2 లక్షల వరకు నష్టం జరిగిందని, అధికారులు స్పందించి పరిహారం అందేలా చూడాలని బాధిత రైతులు కోరారు.



కాలిపోయిన ఉలవ పంటను చూపుతున్న రైతులు

స్టెమి ఇంజక్షన్‌తో గుండెకు భరోసా

చెన్నేకొత్తపల్లి: స్టెమి ఇంజక్షన్‌తో గుండె పోటు నుంచి బయటపడవచ్చని వైద్యులు సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో 'స్టెమి ఇంజక్షన్‌తో గుండెకు భరోసా' కార్యక్రమంలో భాగంగా ఆస్పత్రి వైద్యాధికారిణి డాక్టర్ జయలక్ష్మి, డాక్టర్ రాజశేఖరరెడ్డి వైద్య సిబ్బందికి, స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, రూ.45 వేలు విలువ చేసే స్టెమి ఇంజక్షన్ ఇప్పుడు ప్రభుత్వ ఆస్పత్రుల్లో అందుబాటులో ఉందన్నారు. గుండెనొప్పి వచ్చినప్పుడు నిర్లక్ష్యం చేయకుండా సమీపంలో ఆస్పత్రికి వెళితే ప్రాణపాయం నుంచి బయటపడవచ్చన్నారు. దీనిపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు మాధవి, రవి నాయక్, రమేష్, తేజ్‌దీప్‌తో పాటు పలువురు వైద్య సిబ్బంది హాజరయ్యారు.



చెన్నేకొత్తపల్లి ఆస్పత్రిలో అవగాహన కల్పిస్తున్న వైద్యులు

లక్ష్యం దిశగా 'మార్కెట్లు'

అనంతపురం అగ్రికల్చర్: మార్కెటింగ్ శాఖ నిర్దేశించిన లక్ష్య సాధన దిశగా వ్యవసాయ మార్కెట్ కమిటీలు పయనిస్తున్నాయి. 2024–25కు సంబంధించి 9 మార్కెట్ కమిటీలు, 15 చెక్‌పోస్టుల ద్వారా వివిధ రూపాల్లో రూ.12.09 కోట్లు పన్ను వసూళ్లు లక్ష్యంగా పెట్టుకోగా... జనవరితో ముగిసిన 10 నెలల కాలానికి గాను 75 శాతంతో రూ.8.92 కోట్లు సాధించాయి. అనంతపురం, శింగనమల మార్కెట్ కమిటీలు నిలకడగానే కొనసాగుతుండగా.. ఇంత కాలం వెనుకబడిన రాయదుర్గం, తాడిపత్రి మార్కెట్ కమిటీలు కొంత దూకుడును పెంచాయి. రాయదుర్గం మార్కెట్ కమిటీ ద్వారా ఈ ఏడాది రూ.1.44 కోట్లు లక్ష్యం కాగా జనవరి నెలాఖరుకు 89 శాతంతో రూ.1.28 కోట్లు వసూళ్లు జరిగి టాప్ ప్లేస్ చేరుకంది. ఆ తర్వాత రూ.1.02 కోట్లకు గానూ రూ.82.71 లక్షలు సాధించి 81 శాతంతో శింగనమల రెండో స్థానంలో కొనసాగుతోంది. అలాగే రూ.2.02 కోట్లకు గానూ రూ.1.60 కోట్లతో 80 శాతం లక్ష్యసాధనతో తాడిపత్రి మూడో స్థానం కైవసం చేసుకుంది. అనంతపురం కమిటీ ఈ సారి 75 శాతంతో నాలుగో స్థానంలో నిలవడం విశేషం. ఉరవకొండ కమిటీ 52 శాతం, కళ్యాణదుర్గం 58 శాతం, గుత్తి 61 శాతం, గుంతకల్లు 64 శాతం వసూళ్లతో నడుస్తున్నాయి. రాప్తాడు మార్కెట్ కమిటీ ఎలాంటి పురోగతి లేకుండా అన్నిటికన్నా వెనుకంజలో నిలిచింది.

అదనపు కమిషనర్ బదిలీ

అనంతపురం కార్పొరేషన్: నగరపాలక సంస్థ అదనపు కమిషనర్‌గా ఉన్న రామలింగేశ్వర్ రాజమహేంద్రవరానికి బదిలీ అయ్యారు. ఈ మేరకు శుక్రవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అదేవిధంగా గుంతకల్లు మునిసిపాలిటీ రెవెన్యూ ఆఫీసర్ (కేటగిరి 2) ఎ.తారకనాథ్‌ను బదిలీ చేస్తూ సీడీఎంఏలో రిపోర్టు చేసుకోవాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.

సబ్సిడీ రుణాల గడువు పొడిగింపు

అనంతపురం కార్పొరేషన్: బీసీ, ఈబీసీ కులాల వారికి అందించే సబ్సిడీ రుణాల దరఖాస్తు గడువును ఈ నెల 12 వరకు పొడిగించినట్లు నగరపాలక సంస్థ కమిషనర్ బాలస్వామి తెలిపారు. http://apobms.apcfs.in వెబ్‌సైట్ నుంచి దరఖాస్తు డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

చెన్నమయ్య స్వామి జాతర ప్రారంభం

యాడికి: మండలంలోని రెడ్డి గుడిసెలు గ్రామ సమీపంలో కొండల్లో ఉన్న శ్రీదేవి భూదేవి సమేత చెన్నమయ్య స్వామి జాతర శుక్రవారం ప్రారంభమైంది. మండల కేంద్రంలోని చెన్నకేశవ స్వామి దేవాలయంలో ఉంచిన నూతన శ్రీదేవి, భూదేవి సమేత చెన్నమయ్య స్వాములను ప్రత్యేకంగా అలంకరించి ట్రాక్టర్‌పై కొలువుదీర్చారు. యాడికి, చంద్రాయుని పల్లి, రామన్న గుడిసెలు, రెడ్డి గుడిసెలు గ్రామాల నుంచి ఊరేగింపుగా చెన్నమయ్య కోనలోని చెన్నమయ్య స్వామి దేవాలయానికి తీసుకెళ్లి కొలువుదీర్చారు.